




అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బల్మూరి వెంకట్



గ్యాస్ డోర్ డెలివరీ పేరిట దోపిడీ

- ఒక్కో సిలిండర్‌పై రూ. 25 నుంచి రూ. 40 వసూలు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వంట గ్యాస్ డెలివరీ చార్జీల పేరిట గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులను దోచుకుంటున్నారు. ఒక్కో సిలిండర్‌పై ఏరియాను బట్టి ఆయా కంపెనీల డీలర్లు 25 నుంచి 40 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు చార్జీల పేరుతో నెలకు లక్షల్లో ఆర్జిస్తున్నారు. అయినా కూడా పౌరసరఫరాల శాఖాధికారులు గానీ, చమురు కంపెనీల అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 20కి పైగా గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,05,718 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఇందులో గృహ అవసరాల కోసం 2,27,408 గ్యాస్ కనెక్షన్లు, వాణిజ్య పరంగా 78,310 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీ వంట గ్యాస్ ధర 977 రూపాయలు కాగా, డెలివరీ బాయ్స్ 1000 ఆ పైన 1010 వరకు వసూలు చేస్తున్నారు. ఉజ్వల కనెక్షన్లు, వాణిజ్య పరమైన గ్యాస్ కనెక్షన్లపై కూడా అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతు న్నారు. పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానా బాద్, మంథని, కమాన్‌పూర్, రామగుండం, జూలపల్లి, ఎలిగేడు, ధర్మారం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి మండలాల్లో ఉన్న గ్యాస్ వినియోగదారులకు ఆయా కంపెనీలకు చెందిన ఏజెన్సీలు గ్యాస్ సరఫరా చేస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఐదు కిలోమీటర్ల వరకు వంట గ్యాస్‌ను డెలివరీ చార్జీలు ఏమీ తీసుకోకుండా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఐదు నుంచి 15 కిలోమీటర్ల దూరం లోపు 15 రూపాయలు, అంతకు మించితే 20 రూపాయలు డెలివరీ చార్జీల కింద తీసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి.

కానీ నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీల నిర్వాహకులు ఒక్కో సిలిండర్ సరఫరాపై 25 నుంచి 40 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాలకు సిలిండర్లు సరఫరాకు 40 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్లు తరలించే వాహనాల వెంట ఎలక్ట్రానిక్ కాంటా ఉండాలని, డోర్ డెలివరీ చేసేటప్పుడు విధిగా తూకం వేసి సిలిండర్ ఇవ్వాల్సి ఉంటుంది. వినియోగదారుడు గోదాంకు వచ్చి గ్యాస్ సిలిండర్ తీసుకుంటే 20 రూపాయల రిబేట్ ఇవ్వాలి. కానీ ఇక్కడ అలాంటివేమి అమలవుతున్న ట్లుగా కనబడడం లేదు. ఒక్కో ఏజెన్సీ నుంచి రోజుకు 100 నుంచి 120కు పైగా సిలిండర్లు డెలివరీ అవుతుంటాయి. జిల్లా వ్యాప్తంగా రోజుకు రెండు నుంచి మూడు వేల సిలిండర్లకు పైగా డెలివరీ అవుతుంటాయి. వీటి పేరిట రోజుకు 50 వేల నుంచి 75 వేల రూపాయల వరకు అదనంగా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ఒక్క సిలిండర్‌ను కూడా డెలివరీ చార్జీలు వసూలు చేయకుండా ఇవ్వడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఏజెన్సీ గోదాం నుంచి ఐదు కిలోమీటర్ల లోపు దూరమే సరఫరా చేసే కనెక్షన్లు ఉంటాయి. అయినా కూడా డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్‌ను ప్రశ్నిస్తే, ఏజెన్సీ నిర్వాహకులు చెప్పినట్లు చేస్తున్నామని అంటారని, చార్జీలు ఇవ్వకుంటే సిలిండర్ ఇవ్వకుండా వెళుతున్నారని, గోదాం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని చెబుతున్నారని వినియోగదారులు తెలిపారు. విధిలేక అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తున్నదని అంటున్నారు. డెలివరీ బాయ్స్ జబర్దస్తీగా అదనపు చార్జీలు వసూలు చేస్తు న్నారు. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల శాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

ధర్మారం, జనవరి 22: మండలంలోని దొంగతుర్తి గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో గల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ ఎ రజిత, ఎంపీడీవో బి జయశీల సోమవారం పరిశీలించారు. దొంగతుర్తిలో ప్రభుత్వ భూమిని సర్పంచ్ ఏకపక్ష నిర్ణయం తీసుకుని ఇతరులకు భూమి కేటాయించే ప్రయత్నం చేస్తున్నాడని ఎంపీటీసీ సభ్యుడు దాడి సదయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు తహసీల్దార్, ఎంపీడీవో పరిశీలించారు. రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా ఇతరులకు భూ కేటాయింపు ఉండదని తహసీల్దార్ రజిత తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే గని ప్రమాదాలు

గోదావరిఖని, జనవరి 22: సింగరేణిలో అధికారుల నిర్లక్ష్యం వల్లనే బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కేంద్ర కన్వీనర్ మాదాసు రామమూర్తి, కో కన్వీనర్ నాగెల్లి సాంబయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. సోమవారం జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో మైనింగ్ సర్దార్ మందాడి సమ్మిరెడ్డి గాయపడ్డారని, యాజమాన్యం రక్షణ చర్యలు ఉల్లంఘించడం వల్లే ప్రమాదాలు జరిగాయని ఆరోపించారు.

గనుల్లో తగినంత మంది మైనింగ్ సిబ్బంది లేకుండా పనులు నిర్వహించడం వల్ల మైనింగ్ సిబ్బంది అధిక పనిభారం పడుతుందన్నారు. జీడీకే 2ఏ గనిలో ఓవర్‌మెన్ లేకుండానే జనరల్ షిఫ్టు పనులు నిర్వహించారని, సర్దార్‌తోనే షార్ట్ ఫైరింగ్ విధులు కూడా నిర్వహించాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. బొగ్గు నింపే టబ్బులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు నిర్ణీత సమయానుసారం పరీక్షించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని, యాజమాన్యంకు బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదని ఆరోపించారు. ఇప్పటికైనా గనిలో రక్షణ చర్యలు పెంచాలని, ప్రమాదానికి బాధ్యులైన మేనేజర్, రక్షణ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గణతంత్ర దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ప్రజావాణిలో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణతంత్ర దినోత్సవ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం గణతంత్ర దినోత్సవ నిర్వహణపై ఆయన అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం నాడు వివిధ శాఖల ద్వారా ఆకర్షణీయమైన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించాలని నిర్ణయించామని, ఇందుకు అనుగుణంగా ప్రతీ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు జనవరి 24 లోగా సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వేడుకలకు సంబంధించి ప్రొటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, పరేడ్ గ్రౌండ్, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులతో నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారినీ ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం జిల్లాలోని వీఐపీలు అందరికీ తప్పనిసరిగా గణతంత్ర దినోత్సవానికి ఆహ్వాన పత్రిక అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి వివరిస్తూ కలెక్టర్ సందేశాన్ని క్లుప్తంగా తయారు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్డీవో సీహెచ్ మధుమోహన్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

- ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి..

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓదెల మండలం శానగొండ గ్రామానికి చెందిన బి చేరాలు గ్రామ శివారులో గల సర్వే నంబర్ 93లో 2ఎకరాల 27 గుంటల వ్యవసాయ భూమిలోని బావికి అర్అండ్‌బీ రోడ్డుకు మధ్యలో ఉన్న మత్తడి ఒర్రెను కూల్చారని కలెక్టర్‌కు తెలిపారు. దీంతో వరద నీటితో తన బావి కూలిపోయే అవకాశం ఉన్నందున ప్రస్తుతం బావికి నీరు రాకుండా గోడ నిర్మాణం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. ఆర్అండ్‌బీ అధికారులకు రాసి పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే పదో తరగతి పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఫలితాల సాధన దిశగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులందరికి ఉదయం ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శుల, ఇతర అధికారుల ద్వారా వేకప్ కాల్స్ చేసి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని అన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ముఖ్యమైన పాఠ్యాంశాలతో కూడిన వర్క్ బుక్ తయారు చేసి అందించామని కలెక్టర్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సైతం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతీరోజు కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తామని, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులు సైతం తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు చదువుకునేలా ఇంటిలో ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణ కల్పించాలని కోరాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సీహెచ్ మధుమోహన్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

29న ఖాళీగా ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూ

- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ రమాకాంత్

పెద్దపల్లి టౌన్, జనవరి 22: మంథని, సుల్తానాబాద్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం జనవరి 29న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ రమాకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు, ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వైద్యులు జనవరి 29న మధ్యాహ్నం మూడు గంటల నుంచి పెద్దపల్లి జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. గైనకాలజిస్టు, మత్తు వైద్య నిపుణులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, ఈ పోస్టుల కాలపరిమితి 2024 మార్చి 31 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల వైద్యులు జనవరి 29న జరిగే ఇంటర్వ్యూకి ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9492457809 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

దివ్యాంగుల నిర్ధారణ పరీక్షలు



పెద్దపల్లి మండలంలో నిర్ధారణ పరీక్షలకు హాజరైన ప్రజలు

పెద్దపల్లి రూరల్, జనవరి 22: మండలంలోని రాగినేడు, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 30 గ్రామాలు, పట్టణ ప్రాంతంలోని వికలాంగులు, ఫైలేరియా, లెప్రసీ వల్ల అంగవైకల్యంలతో పాటు పలు రకాలకు సంబంధించిన వాటిపై సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సదరం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిర్ధారణ కోసం రాగా వైద్యులు మమత, శ్రవణ్‌కుమార్ పరీక్షించి 112 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పెద్దపల్లి ఎంపీడీవో రాజు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగుల నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ డాక్టర్లు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున దివ్యాంగుల నిర్ధాణ పరీక్షలు నిర్వహించుకోవడానికి హాజరయ్యారు. నిర్ధారణ పరీక్షల క్యాంపును తహసీల్దార్ జాహెద్‌పాషా, డిప్యూటీ తహసీల్దార్ ధీరన్ నిర్ధారణ పరీక్షలు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ వికలాంగుల నిర్ధారణ పరీక్షలు చేసుకోవడానికి 24గ్రామపంచాయతీ నుంచి ప్రజలు వచ్చారని, కానీ 100శాతం వికలాంగత్వం కలిగిన వారికి మాత్రమే పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేందర్, భవాని, పరీక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని పుట్నూర్, బసంత్‌నగర్ ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రత్యేక సదరం శిబిరాలను సోమవారం నిర్వహించారు. పుట్నూర్ ఆరోగ్య కేంద్రానికి పరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి 100 మంది హాజరు కాగా 36 మంది పేర్లను నమోదు చేసుకున్నామని పుట్నూర్ ప్రధాన వైద్యాధికారి సాయిసూర్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాల లలిత హాజరయ్యారు. బసంత్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 140 మందికి పరీక్షలు నిర్వహించి 60 మంది వికలాంగుల పేర్లను నమోదు చేసుకున్నామని ప్రధాన వైద్యురాలు హరిత తెలిపారు.

మంథనిరూరల్: మండలంలోని గద్దలపల్లి పీహెచ్‌సీలో సోమవారం సదరం క్యాంపును ఏర్పాటు చేశారు. ఈసందరం క్యాంపులో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 254 మంది వికలాంగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సదరం క్యాంపును ఎంపీపీ కొండ శంకర్, వైస్‌ఎంపీపీ కొమ్మిడి స్వరూప్‌లు సందర్శించారు. క్యాంపులో స్వజన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టీపీ నిర్మాణం కోసం రూ.1.18కోట్లు

కళ్యాణ్‌నగర్, జనవరి 22: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) నిర్మాణం కోసం టీఎస్‌ఎంఐడీసీ నుంచి సోమవారం రూ.1.18కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 80పడకల ఆసుపత్రి పక్కన ఈ ప్లాంట్ నిర్మాణాన్ని చేయనున్నారు. ఆసుపత్రిలోని డ్రైనేజీ నీటిని ఈ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేసి బయటకు పంపనున్నారు. నిర్మాణ పనులను సోమవారం నుంచి చేపడుతున్నారు.

విద్యార్థినిని అభినందించిన ప్రభుత్వ విప్

ధర్మారం, జనవరి 22: ధర్మారం మండల కేంద్రంలో గల ఆదర్శ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భూక్య ప్రవళిక జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికకాగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం అభినందించారు, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రవళికను సత్కరించి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ. 5వేలను అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీనాకుమారి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, పీఈటీ బైకాని కొమురయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ పట్టా భూములు ఇవ్వాలి

జ్యోతినగర్, జనవరి 22: పభుత్వ జాగాలో ఇళ్లు నిర్మించుకున్న పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకుడు బి భిక్షమయ్య కోరారు. రామగుండం కార్పొరేషన్ 2వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ శివారులో సీపీఎం ఆధ్వర్యంలో ఆక్రమిత ప్రభుత్వ స్థలంలో కొత్త కాలనీని ఏర్పాటు చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం మేడిపల్లి శివారులోని ఇందిరమ్మ కాలనీ పక్కన ప్రభుత్వ భూములను పేదలు ఆక్రమించారు. గుడిసెలు నిర్మించి సీపీఎం ఆధ్వర్యంలో మూడునెలలుగా ఉద్యమిస్తున్నారు. సుమారు 45 మంది పేదలు ఆ స్థలంలో ఇల్లను నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో పేదలు నిర్మించుకున్న కొత్త కాలనీకి భగత్‌సింగ్ నగర్ అని నామకరణం చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకుడు బి భిక్షమయ్య భగత్‌సింగ్ కాలనీని ప్రారంభించారు. అలాగే కాలనీలో సీపీఎం జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి వై.యాకయ్య ఎగుర వేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాకయ్య, మహేశ్వరి, రామాచారి, కుమారస్వామి,లావణ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి





చీకురాయిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఓదెల మల్లన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జనవరి 22: పెద్దపల్లి నియోజకవర్గంలోని గ్రామాలు పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని చీకురాయిలో ఈజీఎస్, ఎస్‌డీఎఫ్, జిల్లా పరిషత్ ద్వారా రూ.58 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, మురికి కాలువలు, హైమాస్ట్ లైట్స్, రామాలయంలో అదనపు గదుల నిర్మాణం, ఎల్లమ్మగుడి ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారి గ్రామానికి రావడంతో ప్రజలు ఘనస్వాగతం పలికారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైనా వారికి పక్కాగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం పెంపు పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, సర్పంచ్ బండారి త్రివేణి-రామ్మూర్తి, పెద్దకల్వల, భోజన్నపేట సర్పంచ్‌లు కారెంగల రమేష్, మేకల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కడార్ల శ్రీనివాస్, మండల సత్యనారాయణరెడ్డి, ప్రకాష్‌రావు, రాజేందర్, అర్కుటి సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండలంలోని కందునూరిపల్లిలో ఈజీఎస్ పథకం ద్వారా 20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కందునూరిపల్లి గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు ఉందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పన్నాల స్వరూప తిరుపతి, జడ్పీటీసీ మినూపల స్వరూపప్రకాశ్‌రావు, నాయకులు దాన్నాయకి దామోదరరావు, చిలుక సతీష్, పన్నాల రాములు, వెగొలపు అబ్బయ్య గౌడ్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు..

ఓదెల: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠాపన రోజున మల్లికార్జున స్వామికి అభిషేకం నిర్వహించి, గ్రామాలు అభివృద్ధి చెందాలని మొక్కులు తీర్చుకున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. సోమవారం మల్లికార్జునస్వామి క్షేత్రాన్ని ఎమ్మెల్యే సతీసమేతంగా సందర్శించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత ఆలయానికి మొదటిసారిగా రావడంతో ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మల్లన్న గర్భగుడిలో అభిషేకం నిర్వహించారు. అలాగే రామాలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో సదయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించి ఆలయ చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యేగా విజయరమణారావు గెలవడంతో ఐలు స్వామి ఆధ్వర్యంలో కొబ్బరికాయలను కొట్టారు. నాంసానిపల్లిలోని ఆలయంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠోత్సవాలకు హాజరయ్యారు. ఓదెలలో దళిత మహిళలు ఎమ్మెల్యే ఎత్తు పంచదార తూకం వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అంకం రమేష్, చొప్పరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యేకు సన్మానం..

ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులతోపాటు అన్ని వర్గాలకు చెందిన వారంతా నా గెలుపు కోసం కృషి చేశారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహించారు. భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అంకం రమేష్, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, అంబాల కొమురయ్య, చొప్పరి రాజన్న, చింతం కుమార స్వామి, గుండేటి ఐలయ్య యాదవ్, పుప్పాల శంకర్, రౌతు మనోజ్, రెడ్డి రజనీకాంత్, బైరి రవిగౌడ్, బోడకుంట కుమారస్వామి, బోడకుంట శంకర్, గోపతి సదానందం, క్యాతం వెంకన్న, మీసుగు సంతోష్, చీకట్ల ముండయ్య, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

రామగిరి, జనవరి 22: మండలంలోని కల్వచర్ల గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో యువజన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ సోమవారం నిర్వహించారు. కల్వచర్ల గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లిదేవక్క, స్థానిక సర్పంచ్ గంటపద్మ, ఎంపీటీసీ కొట్టే సందీప్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డబాపు, మాజీ జడ్పీటీసీలు సదానందం, గంట వెంకటరమణరెడ్డి, నాయకులు వనం రాంచందర్‌రావు, కొలిపాక సుజాత, ఎండీ ఆలీం, ఎండీ ఆరీఫ్, ముచ్చకుర్తి శ్రీనివాస్, నాంసాని సందీప్, అనవేని మొగిళి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ భవన కూల్చివేతకు బహిరంగ వేలం

కళ్యాణ్‌నగర్, జనవరి 22: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ సెంటర్ భవన నిర్మాణానికి ఆటంకంగా ఉన్న పాత ఎంప్లాయీస్‌యూనియన్ భవన నిర్మాణాన్ని కూల్చివేయడానికి ఈ నెల 23న ఆసుపత్రి ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత యూనియన్ కార్యాలయ భవనంతో పాటు ఉపరితల రిజర్వాయర్‌ను కూడా కూల్చివేయనున్నట్టు, ఆసక్తి గల సంస్థలు ఈ నెల 23న 11గంటలకు ఆసుపత్రి ఆవరణలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 22: తెలంగాణ సాంస్కృతిక సారధి జనగామ రాజనర్సు టీ కళాకారులు మండలంలోని గంగారం గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్ఓ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలపైన యువత చెడు మార్గంలో నడవకుండా, చెడు అలవాట్లకు భారిన పడకుండా, రేపటి దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో అమలైన రెండు గ్యారంటీలు మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పథకం పైన అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు ఈదునూరి పద్మ, కోండ్ర వెంకన్న, ఇల్లందుల మల్లేష్, జిన్న రమ, సలేంద్ర రాజన్న, ఢీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవలి పాల్గొని పాటల రూపంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

తంగళ్లపల్లి, జనవరి 22: తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన నేనర్ల ప్రశాంత్(24) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నేనర్ల శంకర్- అరుణ దంపతుల కుమారుడైన ప్రశాంత్ భవన నిర్మాణం సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ప్రమాదం జరగడంతో గాయలై సరిగా పనిచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈ నెల 20వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 22 : కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో ఉజ్వల పార్క్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన అసరి అనిల్‌యాదవ్‌దిగా వెల్లడైందని తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయగా, పారిపోయిన డ్రైవర్ తప్పట రవీందర్, యజమానిలపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు కేడీసీలో అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టులో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 430క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 978క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

ఉషు జట్టు రాష్ట్ర కోచ్‌గా రాణావిక్రమ్ గాంధీ


రాణావిక్రమ్ గాంధీ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 22: జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి 28వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య ఉషు పోటీల రాష్ట్ర జట్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గంభీరావుపేటకు చెందిన భార రాణావిక్రమ్ గాంధీ కోచ్ కమ్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తారని ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధానకార్యదర్శి పోతన శ్రీనివాస్, ఉషు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, భార విద్యాసాగర్, జి.శశాంక్‌రెడ్డి అభినందించారు.

గంజాయి పట్టివేత : ఇద్దరు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 22 : కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో ఈ నెల 20న సాయంత్రం పోలీసుపెట్రోలింగ్ సందర్భంగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1,100 కిలోల నిషేధిత గంజాయి పట్టుబడిందని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కనమల్ల ప్రభుదయాల్(20), కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన తెల్ల మహేష్‌బాబు(23)ల వద్ద గంజాయి పట్టుబడగా కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలుచేసి కొంత వినియోగిస్తూ, కొంత విక్రయిస్తున్నారని తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు

● నిరంతరాయంగా స్వామివారి దర్శనం


వేములవాడలో భక్తుల రద్దీ


వేములవాడలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు


కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, జనవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ సోమవారం భక్తజన ప్రవాహంగా మారింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వేలాదిమంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్థిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ స్వామి వారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్ర దర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటలకు పైగా సమయం అవసరం అయింది. రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆదివారం తెల్లవారుజామున ప్రాతఃకాల పూజ నుంచి సోమవారం రాత్రి నిశి పూజ వరకు ఆలయాన్ని నిరంతరాయంగా తెరిచి ఉంచారు. దీంతో భక్తులు ఆదివారం రాత్రి అంతా స్వామివారిని దర్శించుకునే అవకాశం లభించింది. రాత్రివేళ సైతం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఫలితంగా సోమవారం మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. ఆది,సోమవారాలలో కలిపి సుమారు 80 వేలకు పైగా భక్తులు స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ దేవాలయం కూడా భక్తులతో రద్దీగా మారింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి. శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

వేములవాడ : అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోని సీతారామచంద్ర స్వామివార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు వేద పండితులు సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

కొండగట్టులో రాములోరికి ప్రత్యేక పూజలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో సోమవారం శ్రీసీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు జరిపారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులకు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ముత్తారం జనవరి 22: మండలంలోని మైదంబండ గ్రామంలో ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఎర్రం సురేష్ అనే వ్యక్తి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అదే గ్రామానికి చెందిన కొంతమందికి తెలియజేయడంతో ఎర్రం సురేష్‌ను మందలించి అక్కడి నుంచి పంపించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

చందుర్తి, జనవరి 22: ఉపాధి లేక గల్ఫ్ వెళ్లేందుకు ప్రయత్నించి అనారోగ్య కారణాలతో మెడికల్ రిపోర్టు అన్‌ఫిట్ కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గసికంటి అజయ్ (23) అనే యువకుడు గ్రామంలో సరైన ఉపాధి లేక గత కొద్ది రోజుల నుంచి గల్ఫ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. యువకుడు గతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మెడికల్ రిపోర్ట్‌లో పలుమార్లు అన్‌ఫిట్ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారునికి ఫోన్లు వస్తున్నప్పటికీ ఫోన్ మాట్లాడడం లేదని తల్లిదండ్రులు చూసేసరికి దూలానికి ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే తలుపులు తీసి ఆస్పత్రికి తరలించే వరకే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు కార్లు దహనం


సర్వారంలో దహనమైన కారు


బల్వంతాపూర్‌లో దహనమైన కారు

ముత్తారం జనవరి 22: మండలంలోని మైదబండ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కారు దగ్ధం అయింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మైదబండ గ్రామానికి ఒక కారు వచ్చిందని అక్కడ గొడవ జరగడంతో ఆ కారు తిరుగు ప్రయాణంలో లక్కారం కాశిపల్లె మీదుగా అతివేగంగా వెళ్లి సర్వారం గ్రామాల్లో అదుపుతప్పి డ్రైనేజీలో పడిందని గ్రామస్థులు తెలిపారు. కారు అదుపు తప్పడంతో కారు అక్కడే వదిలేసి అందులో ఉన్న వారు వెళ్లిపోయారని సోమవారం తెల్లవారుజామున కారు దగ్ధమై ఉందని తెలిపారు. కారు దహనం చేసిన వారు ఎవరై ఉంటారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారును పరిశీలించారు. ఇప్పటివరకు కారుకు సంబంధించిన వ్యక్తులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. కారు దహనం కావడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మైదంబండ గ్రామానికి ఆదివారం కారులో వచ్చి బియ్యాని కిష్టస్వామిపై దాడికి పాల్పడ్డారని తిరుగు ప్రయాణంలో ఇలాంటి సంఘటన జరిగిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

కారుకు నిప్పటించిన దుండగులు

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు నక్క అనిల్ కారును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించి దహనం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... రాజారంకు చెందిన తన మిత్రుని కారును తీసుకువచ్చి అనిల్ వాడుకుంటున్నాడు. ఆదివారం తన ఇంటి వద్ద రాత్రి 11 గంటలకు పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. కొద్ది సేపటి తరువాత మంటలతో శబ్దం రావడాన్ని అనిల్ తండ్రి గుర్తించాడు. కుటుంబ సభ్యులు బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో కారు లోపలి భాగం, టైర్లతో పాటు దాదాపుగా పూర్తిగా కారు దహనం అయింది. కారు కింద కర్ర దుంగ పెట్టి పెట్రోల్ పోసి నిప్పటించినట్లు తెలుస్తోందని బాధితుడు అనిల్ తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అనిల్‌ను పరామర్శించి కాలిపోయిన కారును పరిశీలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్సై అశోక్‌ను ఆదేశించారు.

ధర్మపురిలో వేద పారాయణం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 22: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు ఐదవ రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కేదారి ఘనాపాఠి మరో 21 మంది వేదపండితులు యధావిధిగా రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడా వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజల్లో పాల్గొని ఆశీర్వచనం పొందారు. ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండి తులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు నగునూరు గురుకుల కళాశాలలో జాతీయ సదస్సు

కరీంనగర్‌రూరల్, జనవరి 22: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో ఈ నెల 23న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి హైదరాబాద్ సౌజన్యంతో రసాయన శాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, మానిటరింగ్ టెక్నిక్స్ అనే అంశంపై ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని సదస్సుల్లో పాల్గొనవచ్చన్నారు.

31నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జనవరి 22 : ఎస్.యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఎం.బీ.ఏ ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు, ఎం.సి.ఏ. ఫిబ్రవరి 12 వరకు ఎం.ఏ, ఎం.కామ్ ,ఎం.ఎస్సీ ఎం.ఎస్.డబ్ల్యూ పరీక్షలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎస్.యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.

లోన్ యాప్ వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, జనవరి 22: లోన్ యాప్ వేధింపులు భరించలేక గోదావరిఖని 7ఎల్‌ఈపీ కాలనీకి చెందిన ఆకుల మహేష్(24) అనే యువకుడు సోమవారం రాత్రి ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై బొగ్గు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రైలు ఇంజన్ మహేష్‌ను పట్టాలపై కొంతదూరం నెట్టుకెళ్లింది. దీంతో అతని ఎడమ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నాడు. మహేష్ సోదరుడు రాకేష్ కథనం ప్రకారం ఎంబీఏ పూర్తి చేసిన మహేష్ సింగరేణిలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవలే ఓ యాప్‌లో రుణం తీసుకున్నాడు. చాలా వరకు డబ్బులు కట్టాడు. అయినా ఇంకా వడ్డీలు, లేట్ ఫీజులతో రూ.29,860బకాయి చెల్లించాలని, లేకపోతే వాట్సాప్‌లో నీ ఫొటో, నీ కుటుంబ సభ్యుల ఫొటోలు పెట్టి నీ బంధుమిత్రులందరికీ అసభ్యంగా మెసేజ్‌లు పంపుతామంటూ బెదిరించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన మహేష్ తన స్నేహితుడికి ఫోన్ చేసి వాపోయాడు. అనంతరం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

కరీంనగర్ క్రైం, జనవరి 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో స్పృహ కోల్పోయిన గుర్తుతెలియని మహిళ మరణించిందని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో గుర్తుతెలియని మహిళ(30-35) బస్టాండ్‌లో స్పృహకోల్పోగా ఆర్టీసీ సిబ్బంది వెంటనే ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు వెల్లడించారు. మహిళ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మహిళను గుర్తించిన వారు పోలీసులు ఫోన్ నెంబరు 8712670761, 9908440822కు సమాచారం అందించాలని కోరారు.

అంతర్‌జిల్లా నేరస్థుడిపై పీడీ యాక్ట్ అమలు

సిరిసిల్ల క్రైం, జనవరి 22: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్‌కు చెందిన అంతర్‌జిల్లా నేరస్థుడైన కటుకోజ్వల రమేశ్ చారి(37)కు పీడీయాక్ట్ అమలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో అమాయక ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడని రమేశ్‌చారిపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పీ.డీ.యాక్ట్ అమలుకు ఉత్తర్వులు ఇవ్వగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నిందితుడికి ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి ఉత్తర్వులు అందజేసి సోమవారం చర్లపల్లి జైలుకు తరలించారు. గతంలో రమేశ్‌చారి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిరుద్యోగులను మోసం చేసి ఉద్యోగాలు పెట్టిస్తానని చెప్పి నమ్మించి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేయడంతో అతనిపై ఎనిమిది కేసులు నమోదయ్యాయి. దీంతో కరీంనగర్ కమిషనరేట్‌లో పీడీయాక్ట్‌తో జైలుకు వెళ్లివచ్చాడు. సిరిసిల్ల, వీర్నపల్లి, వేములవాడ, తదితర ప్రాంతాలు తిరుగుతూ తక్కువ ధరకు బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులు సరఫరా చేస్తానని అమాయక ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడడంతో అతనిపై 12కేసులు నమోదుచేసి పీడీ యాక్ట్‌తో అరెస్ట్ చేశారు.

కోట్లాది మందికి ఆరాధ్యదేవుడు శ్రీరాముడు

● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ● శ్రీరామ నామస్మరణతో మార్మోగిన జిల్లా ● అయోధ్య బాలరాముని ప్రతిష్ఠాపనోత్సవాన్ని వీక్షించిన భక్తులు





ధర్మారం రామాలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎన్టీపీసీ ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు, యైటింక్లయిన్‌కాలనీలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కోట్లాది మందికి శ్రీరాముడు ఆరాధ్య దైవమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠోత్సవాన్ని జిల్లాలోని ప్రజలు టీవీల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సమయాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

పెద్దపల్లి కల్చరల్, జనవరి 22: అయోధ్య రామాలయం మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా భక్తులు, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు నాయకులు ఆయా ఆలయాల వద్ద టీవీలను ఏర్పాటు చేసి తిలకిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు చందపల్లిలోని పంచముఖి ఆలయంలో ఆయా కార్యకర్తల మధ్య భక్తుల మధ్య ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. పెద్దపల్లి పట్టణంలోని కోదండ రామాలయంలోనూ, శాంతినగర్ అలాగే రైల్వేస్టేషన్ రోడ్‌లోని శ్రీ భక్త హనుమాన్, వివిధ ఆలయాల్లో ఈ కార్యక్రమాలను కనులవిందుగా తిలకించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు కాషాయ జెండాలతో ర్యాలీ చేపట్టారు.



ధర్మారంలో ఊరేగింపు నిర్వహిస్తున్న రామ భక్తులు



కోదండ రామాలయంలో శ్రీరామ నామ లేఖన కార్యక్రమం



మంథనిలో కరసేవకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మారం: కోట్లాది మందికి ఆరాధ్యదేవుడు శ్రీరాముడునని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మారంలో రామాలయం, హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశా రు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ, సర్పంచ్ జితేందర్‌రావు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మేడవేని తిరుపతి, ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల రాంబాబు, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, పూజారులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రిలియంట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఖిలావనపర్తి రామాలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మంథని: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మంథనిలో భక్తజనం కన్నుల పండుగగా వీక్షించారు. స్థానిక లక్ష్మీనారాయణ ఆలయ ఆవరణలో విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లలో వీక్షించారు. మంథని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పురవీధుల వెంబడి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో, ఇళ్లలో దీపాలు వెలిగించారు. మంథనిలో శ్రీరాముని శోభయాత్ర నిర్వహించగా జడ్పీ చైర్మన్ పుట్ట మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముని శోభాయాత్ర రథాన్ని పట్టణ పురవీధుల్లో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు శ్రీను బాబు స్వయంగా నడిపి సందడి చేశారు. ఈసందర్భంగా అభిమానులు కరీంనగర్ కాబోయే ఎంపీ శ్రీనుబాబు అంటూ నినాదాలు చేశారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా 1992 డిసెంబరు 6న జరిగిన కర సేవలో పాల్గొన్న మంథనికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్, కనుకుంట్ల స్వామి, మాడిశెట్టి సుదర్శన్లను బెజ్జంకి డిగంబర్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీలక్ష్మీనారాయణ స్వామి టెంపుల్‌లో ఘనంగా సన్మానించారు.

మంథనిరూరల్: మండలంలోని ఖానాపూర్, ఎక్లాస్‌పూర్, మైదుపల్లి, గాజులపల్లి, మల్లెపల్లి, దుబ్బపల్లి, పలు గ్రామాల్లో దేవాలయాలలో శ్రీరామ భజనలు చేశారు. సాయంత్రం చిరుతల రామాయణ భక్తులు, తదితరులు భజన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని రాగినేడు, అందుగులపల్లి, కాపులపల్లి, పెద్దబొంకూర్, కొత్తపల్లి, మూలసాల, హన్మంతునిపేట, ముత్తారం, రంగాపూర్, రాఘవపూర్ గ్రామాలతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో భక్తులు కాషాయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు.

కోల్‌సిటీటౌన్: రామగుండం పారిశ్రామిక ప్రాంతమంతా రామనామస్మరణలతో పులకించింది. గోదావరిఖనిలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని సీతరామచంద్రస్వామికి ప్రత్యేక అర్చనలు, తీర్థప్రసాద వితరణలు చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు మధుసూధనచార్యులు, గిరిధర చార్యులు, శశిధరాచార్యులు మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కాగా కోదండ రామాలయం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో వెయ్యి మందితో శ్రీరామ నామ లేఖనము, భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సిబ్బంది. వీహెచ్‌పీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీలో శ్రీరామ జపంతో మార్మోగింది. ఈ ప్రాంతంలోని ఆలయాలలో రాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. భక్తి గీతాలు, మహిళల కోలాటాల మధ్య పూజా కార్యక్రమాలను చేశారు. అలాగే టీటీఎస్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామునికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

● అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి పాఠశాలలో అయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ: పారిశ్రామిక ప్రాంతంలోని వాడవాడలు రామనామ జపంతో మార్మోగాయి. మహిళలు ఇంటి ముందు రంగు రంగుల రంగవల్లులు వేశారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లో భారీ రాముని చిత్రపటానికి ఏర్పాటు చేసిన స్థానికులు, యువకులు, వ్యాపారులు శ్రీరాముని పూజలు నిర్వహించారు. స్థానిక జీఎం కాలనీలోని సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సీతారాముల చిత్రపటాలతో శోభయాత్ర నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి ప్రారంభమైన శోభయాత్ర లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ పురవీధుల గుండా కొనసాగింది. మహిళలు కోలాట నృత్యాలు, బాణాసంచా కాల్చుతూ సంబరాలు నిర్వహించారు.

ముత్తారం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండలం కేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయం, హరిహర దేవాలయంతో పాటు మండలంలోని కిష్టంపేట, మంగపేట, మీర్జంపేట, పెగడపల్లి, కూనారం, గంగారం, లక్ష్మీపురం గ్రామాల్లోని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల భజనలు, శ్రీరామ జపంతో ఆలయాలు మారుమోగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు, ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పలు దేవాలయాల్లో పూజల్లో పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలంలో భక్తజనం రామసామస్మరణతో పలు ఆలయాలు మార్మోగాయి. ఆలయాల వద్ద మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు తరలివచ్చిన భక్తజనం మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓదెల: ఓదెల సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు గుంపుల రామభద్రాలయం, పొత్కపల్లి, నాంసానిపల్లి ఆలయాల్లో హోమాలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్, గర్రెపల్లి, పూసల, కనుకులా, ఐతురాజ్ పల్లి తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున భజనలు, పూజలు, అభిషేకాలు, అన్నదానాలు ఊరేగింపులు నిర్వహించారు. రేగడి మద్దికుంట గ్రామంలో అయోధ్యలో పోలిన ఆలయాన్ని ,బాల రాముని తో కూడిన చిత్రపటాలకు పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాటాలతో మంగళహారతులతో పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని పలు ఆలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు భజనలు చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలను చేపట్టి తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. సెంటినరీకాలనీ కొదండరామాలయంలో అయోధ్యలో జరుగుతున్న బల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ లైవ్ షో కార్యక్రమాన్ని భక్తులకు చూపించారు.

అంతర్గాం: మండలంలోని వివిధ గ్రామాల్లోని శ్రీరామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసతతారామచంద్రస్వామి వారికి పసుపు, కుంకుమ, పుష్పాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని దేవాలయాలు, వివిధ ప్రాంతాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ ఆలయం, సంతోష్‌నగర్, జయశంకర్‌నగర్‌లలో అన్నదానాలు చేశారు. సాయంత్రం విశ్వహిందూ పరిషత్, హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో కాషాయ జండాలతో జై శ్రీరాం నినాదాలతో శివాయలం, వెంకటేశ్వర ఆలయం వరకు శోభాయాత్ర జరిగింది. రామనామస్మరణ, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

జూలపల్లి: మండలంలోని కోనరావుపేట గ్రామ ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. వడుకాపూర్ తదితర గ్రామాల్లోని ప్రజలు శోభాయాత్రలు నిర్వహించారు.

ఎలిగేడు: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు, జడ్పీవైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు



ముగ్గు వేస్తున్న యువతి



ఆకట్టుకుంటున్న సీతారాముల ముగ్గు

డైరీ ఆవిష్కరణ

పెద్దపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వివిధ రకాల పంటలు పండించి అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ శాఖాధికారులు తమ సేవలను విస్తృతంగా అందించాలన్నారు. పంటల సాగులో సస్యరక్షణ చర్యలు, మెళకువలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆది రెడ్డి గారు, రాష్ట్ర సహ అధ్యక్షుడు ఓ. కాంతారావు గారు ,జిల్లా అధ్యక్షులు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి నాగార్జున, కోశాధికారి ఉమాపతి, శ్రీనాథ్, ఏడీఏ పెద్దపల్లి, వ్యవసాయ అధికారులు ప్రమోద్, మోహన్, రాంబాబు, అలివేణి, ప్రత్యూష, అనిత, శ్రీకాంత్, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన ఎంపీడీవో

కాల్వశ్రీరాంపూర్, జనవరి22: కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవో రాంమోహనచారి సోమవారం ఉపాధ్యాయుడిగా మారి 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించారు. ఎంఈవో ఆరెపల్లి రాజయ్యతో కలిసి వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం ఎస్ఎస్‌సీ ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు సంబంధించి వ్యాకరణాంశాలను పిల్లలకు చక్కగా బోధించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి ఆరా తీశారు. విద్యార్థులంతా ప్రత్యేక తరగతులకు తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రుల తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హరీష్, టీచర్లు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ముత్తారం, జనవరి 22: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. సోమవారం ప్రభుత్వ హైస్కూల్ ముత్తారంలో తహసీల్దారు 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. హెడ్‌మాస్టర్ పద్మాదేవితో మాట్లాడగా ఒక అమ్మాయి స్కూల్‌కు రావటం లేదని తెలిపింది. దీంతో తహసీల్దార్ రాజేశ్వరి విద్యార్థి ఇంటికి వెళ్లి ఆమె తల్లితో మాట్లాడి పాఠశాలకు పంపించాలని సూచించింది.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం, జనవరి 22: మండలంలోని దర్యాపూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 2023-24 గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. 6వ తరగతికి వంద సీట్లకు గాను 7,8,9,10వ తరగతులకు మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానించారు విద్యార్థులు ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు కోరారు. దరఖాస్తు చివరి తేదీ ఫిబ్రవరి 22వరకు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్7న నిర్వహిస్తామని తెలిపారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్, జనవరి 22: పట్టణంలోని పూసలరోడ్ ఆటోస్టాండ్(శివాజీ చౌరస్తా)వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డులోని డివైడర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహన్ని ఏర్పాటు చేయాలని శివాజీ యువసేన, బీజేపీ నేతలు మున్సిపాలిటీ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా ఛత్రపతి శివాజీ చౌరస్తా, పూసల రోడ్, ఆటోస్టాండ్ వద్ద శివాజీ జయంతి వేడుకలు, హిందూ పండుగలను పట్టణ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పూసల రోడ్డును శివాజీ చౌరస్తాగా నామకరణం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఛత్రపతి శివాజీ అధ్యక్షులు ఎలగందుల సతీష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గజభింకర్ పవన్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు చిట్టవేని సదయ్య, బీజె వై ఏమ్ జిల్లా కార్యదర్శి బుర్ర సతీష్ గౌడ్, ఎబివిపి జిల్లా హాస్టల్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, పట్టణ కార్యదర్శి కందునూరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 22 : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం జిల్లా విభాగం ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని, స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి గణిత ప్రతిభ పాటవ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ ప్రతిభా పాటవ పోటీలో నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఆంగ్ల మాధ్యమం నుంచి ఆయా జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన పి.శ్వేత జూలపల్లి జి.వికిత (జూలపల్లి) ఎన్.నిఖిల్ వర్మ(కుక్కల గూడూరు), తెలుగు మాధ్యమం నుండి డి.శ్రుతి (అప్పన్నపేట్) ఎన్.అభిరామ్(నిట్టూర్) డి.అశ్విని (ఆరెంద) ఉర్దూ మాధ్యమం నుంచి రేష్మ (రామగుండం), అరీబా తేహసీన్ (పెద్దపల్లి బాలికల) జుఫిషాన్ అంజుమ్ (పెద్దపల్లి బాలికల) రెసిడెన్షియల్ విభాగం నుంచి, ఎన్ శ్రీరామ్ (లింగాపూర్) ఎ.సాహితీ (లింగాపూర్)ఎస్.మనోహర్ (మేడారం) ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్న విద్యార్థులు, రాష్ట్ర స్థాయి ప్రతిభ పాటవ పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ గణితఫోరం రాష్ట్ర పరిశీలకులు తోట శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారిణి డి.మాధవి మరియు పెద్దపల్లి ఆర్డీవో మధు మోహన్ అభినందిస్తూ వారికి నగదు పారితోషకం, బహుమతి ప్రదానం, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిసిఇబి. సెక్రెటరీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రామగిరిఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

రామగిరి, జనవరి 22: రామగిరిఖిల్లాను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలని సోమవారం మండలంలోని బేగంపేట్ గ్రామస్థులు కలెక్టర్ ముజ్మమిల్ ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బేగంపేట్ శివారులో గల రామగిరి ఖిల్లాపై రాముడికి సంబంధించిన అనేక చారిత్రక ఆధారాలు ఇప్ప టికీ కనిపిస్తాయని వినతిలో పేర్కొన్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో భక్తులు దర్శనం చేసుకుంటున్నారన్నారు. ఖిల్లా వరకు సరైన రోడ్డు మార్గం లేక ప్రతి సంవత్సరం భక్తుల రాక తగ్గిపోతుందన్నారు. గ్రామం నుంచి ఖిల్లా వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో మంథని చంటి, జెట్టవేని సంతోష్‌కుమార్, సముద్రాల సునీల్, బోంతల రవీ, సందెల శ్రీనివాస్‌లు కోరుతూ వినతి పత్రం అందజేశారు.

'మరుగుదొడ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి'

కోల్‌సిటీ, జనవరి 22: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలోని పెసరి వాడలో 30ఏళ్ల క్రితం నుంచి ఉన్న సామూహిక మరుగుదొడ్లను కూల్చివేసి స్థలాల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వేగోళపు రమాదేవి, కాలనీవాసులు నగర కమిషనర్ నాగేశ్వర్, తహసీల్దార్ కుమారస్వామిని కోరారు. ఈ మేరకు సోమవారం వారిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ప్రజల అవసరాల నిమిత్తం 30ఏళ్ల క్రితం రామగుండం మున్సిపాలిటీ, సింగరేణి సంస్థలు సంయుక్తంగా వీటిని నిర్మించాయన్నారు.నీటి వసతి లేకపోవడంతో కొంత కాలంగా అవి ఉపయోగంలో లేవని, దానిని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు కూల్చివేశారన్నారు. ఈనెల 15న కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకోకుండా కూల్చివేశారని, ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు.

ఇద్దరు డీలర్లపై కేసు నమోదు

ఎలిగేడు, జనవరి 22: మండలంలోని సుల్తాన్‌పూర్, లాలపల్లి గ్రామంలోని రేషన్ డీలర్లు మల్లాపూర్ రాజమ్మ, పుష్పలతపై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ స్వర్ణ సోమవారం తెలిపారు. నిత్యావసర సరుకులు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ జరుగుతుందా లేదా అని రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా సుల్తాన్‌పూర్‌లోని షాప్ నంబర్ 3603016సంబంధిత రికార్డులను పరిశీలించగా 3.91 క్వింటాళ్ల, లాలపల్లిలోని షాప్‌నంబర్ 3603005తనిఖీ చేయగా 18.52 క్వింటాళ్ల బియ్యం సంబంధిత రికార్డుల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఇద్దరు డీలర్లపై కేసు నమోదు చేసి షాప్ నిర్వహణ ఇన్‌చార్జి బాధ్యతలను ఇతర డీలర్లుకు అప్పగించామని తెలిపారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సివిల్ సప్లై డీటీ శంకర్, ఆర్ఐ శైలజ ఉన్నారు.

ఓసీపీ-5ని పరిశీలించిన డైరెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని, జనవరి 22: సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్, పా) ఎన్‌వీకే శ్రీనివాస్ సోమవారం ఆర్‌జీ-1 ఏరియాను సందర్శించారు. ఓసీపీ-5ని పరిశీలించిన ఆయన వ్యూపాయింట్ వద్ద మ్యాప్‌లను పరిశీలించి గ్యాలరీల్లో పని స్థలాల్లో జరుగుతున్న పనులు, చేపట్టాల్సిన ప్రణాళికల గురించి వివరించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా గురించి జీఎంను అడిగి తెలుసుకున్నారు. గనిలోకి వెళ్లి కోల్‌బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. డంపింగ్ యార్డు వద్ద బొగ్గు నిల్వలను పరిశీలించారు. బొగ్గు రవాణా త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా రక్షణతో విధులు నిర్వహించాలని, దుమ్ము లేవకుండా వాటర్ స్ప్రే చేయాలన్నారు. ఆయన వెంట జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ ఎస్‌వీ రావు, మేనేజర్ అనీల్ గబాలే, సర్వే అధికారి అశోక్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి ఉన్నారు.

డంపర్‌పై కూలిన సైడ్ బర్మ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 22: ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో సైడ్ బర్మ్ కూలిన ప్రమాదం చోటుచేసుకున్నది. ఆదివారం రాత్రి షిఫ్టులో ఓబీ తరలించేందుకు కేటాయించిన కే-364 వంద టన్నుల డంపర్ ఓబీ లోడింగ్ కోసం షావల్ వద్ద నిలిపి ఉంచగా క్వారీ రోడ్డు పక్క మట్టి కుప్ప ఒక్కసారిగా డంపర్‌పై కూలింది. ఈప్రమాదంలో ఆపరేటర్‌కు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడ్డాడరు.

గని ప్రమాదంలో మైనింగ్ సర్దార్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన మందల సమ్మిరెడ్డి



మందల సమ్మిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 22: రామగుండం-1 డివిజన్ జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో సోమవారం మొదటి షిఫ్టులో జరిగిన ప్రమాదంలో మందల సమ్మిరెడ్డి (56) అనే మైనింగ్ సర్దార్ తీవ్రంగా గాయపడ్డాడు. గనిలోని రెండవ సీమ్ 9లెవల్ ఎండ్ లెస్‌లో సమ్మిరెడ్డి మరో ఏడుగురు కార్మికులతో పని చేయిస్తున్నాడు. అదే సమయంలో బొగ్గు లోడుతో గని నుంచి టబ్బులు పైకి వెళుతుండగా 6వ లెవల్ వద్ద హుక్ ఊడిపోయింది. దీంతో టబ్బులు హరియా(కిందకు) జారిపోయాయి. 6వ లెవల్ నుంచి 9వ లెవల్ వరకు వచ్చి బోల్తా పడ్డాయి. శబ్దంతో అక్కడ పని చేస్తున్న కార్మికులు తలోదిక్కు పరుగులు తీయగా సర్దార్ సమ్మిరెడ్డిని టబ్బులు ఢీకొట్టాయి. అతనిపైన టబ్బులు పడిపోవడంతో రెండు కాళ్లు, రెండు చేతులు, పక్కటెముకలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సమ్మిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకై హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

● **డైరెక్టర్(ఆపరేషన్, పా) శ్రీనివాస్ పరిశీలన**

ప్రమాదం జరిగిన జీడీకే 2ఏ గనిని సంస్థ డైరెక్టర్(ఆపరేషన్, పా) శ్రీనివాస్ పరిశీలించారు. గనిలో చేపట్టిన రక్షణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన జీఎం చింతల శ్రీనివాస్ ఉన్నారు.

● **ప్రమాదానికి యాజమాన్యానిదే బాధ్యత: ఏఐటీయూసీ**

జీడీకే 2ఏ గనిలో రక్షణ చర్యల వైఫల్యాలతోనే ప్రమాదం జరిగిందని, ప్రమాదానికి యాజమాన్యానిదే బాధ్యత అని సంస్థ గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కేంద్ర కార్యదర్శి కే స్వామి, బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషం ఆరోపించారు. ఉత్పత్తి లక్ష్యం చేరుకోవాలనే ఆత్రుతతో రక్షణ చర్యలు చేపట్టడం లేదని, క్రమం తప్పకుండా రక్షణ సమావేశాలు నిర్వహించకపోవడం, చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామస్వామి, వెంకటరెడ్డి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

● **క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే**

జీడీకే 2ఏ గని ప్రమాదంలో గాయపడిన మైనింగ్ సర్దార్ మందల సమ్మిరెడ్డిని హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రక్షణ చర్యల వైఫల్యాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ ప్రమాద ఘటనపై మైన్ సేఫ్టీ అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న రాజ్‌ఠాకూర్ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో మక్కాన్‌సింగ్ ఫోన్‌లో మాట్లాడి కార్మికున్ని పరామర్శించాలని, సమ్మిరెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు.